క్లుప్తంగా

ప్రతి ఇంటా సంతోషాలు నింపాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



తాడేపల్లిరూరల్: సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త పంట ఇంటికి చేరి రైతుల ఇంట ఆనందం నింపుతుందని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు. రానున్న కాలంలో ప్రతి ఇంటా సంక్షేమ సిరులు కురుస్తాయని అన్నారు.

టాంగో సూడో క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: 10వ టాంగో సూడో నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెనాలిలోని కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఆరాధ్యుల చరణ్, షేక్ భాషా, పి బెన్ని రాజశేఖర్‌లు రజిత పతకాలు సాధించగా, టి సత్య జశ్వంత్, ఎస్ జ్ఞాన తేజలు కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ కె వెంకటేశ్వరరావు తెలిపారు. పోటీలను ఢిల్లీలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించినట్లు చెప్పారు. శనివారం ఆకాడమీ ఆవరణలో వారిని అభినందించి సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తెనాలి క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కొత్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన కంచర్ల విజయబాబు (40) ఈనెల 10న ఇంట్లో వారితో పురుగు మందులు తీసుకొస్తానని చెప్పి గుంటూరు వచ్చాడు. 11వ తేదీ ఉదయం గుంటూరువారితోటలోని మాధవి రెసిడెన్సీలో రూము తీసుకుని ఉన్నాడు. 12వ తేదీ సాయంత్రం అయినప్పటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా విజయబాబు కిందపడి మృతిచెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటివారి తీరుపై మహిళ ఆందోళన

తెనాలిరూరల్: అత్తింటి వారు కాపురానికి రానివ్వడం లేదని ఓ మహిళ ఆందోళనకు దిగింది. తల్లిదండ్రులతో కలసి అత్తింటికి వచ్చి బాధితురాలు ఆందోళన చేసింది. బాధితురాలు, ఆమె తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన జరుగు సీతారాం, కోటేశ్వరి దంపతుల కుమార్తె రమ్యశ్రీకి బాలాజీరావుపేటకు చెందిన బర్మా రవికిషోర్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. పెళ్లైన తర్వాత ఐదు నెలల గర్భిణిగా ఉన్న సమయంలో పుట్టింటికి వచ్చిన రమ్యశ్రీని తిరిగి కాపురానికి రానీయడం లేదని వారు ఆరోపించారు. వివాహ సమయంలో ఎకరం పొలం, రూ.10 లక్షల కట్నం ఇచ్చామని చెప్పారు. రవికిషోర్ తల్లిదండ్రులు శివనాగేశ్వరరావు, మాధవి, ఆడపడుచు తమ కుమార్తెను కాపురానికి రానివ్వడంలేదని, న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని తెలిపారు. తాము కాపురానికి తీసుకెళ్లమని అడుగుతుంటే రవికిషోర్ కుటుంబ సభ్యులు విడాకులు కోరుకుంటున్నారని చెప్పారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన పొన్నాల సుబ్బారావు(34)కు స్థానిక పాండురంగపేటకు చెందిన శివపార్వతితో వివాహమైంది. భార్య కొంతకాలంగా కాపురానికి రావటం లేదు.దీంతో ఇరు కుటుంబాల వారు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అత్తింటికి వచ్చిన సుబ్బారావు భార్యను కాపురానికి రమ్మని గొడవపడ్డాడు. కాపురానికి వచ్చేందుకు భార్య నిరాకరించడంతో అత్తింట్లోనే రాత్రికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతోషాల పండుగ సంక్రాంతి

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- రోటరీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లిరూరల్: సంక్రాంతి సంతోషాల పండుగ అని, గ్రామాల్లో రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరించి భోగి మంటలు వేస్తారని, ఇలాంటి పండుగ సందర్భంగా రోటరీ క్లబ్ ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని టిడ్కో నివాసాల మధ్య రోటరీ క్లబ్ ఆధ్వర్యాన శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 81 మంది మహిళలు పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయడానికి విచ్చేసిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు అందమైన ముగ్గులు తీర్చిదిద్ది రంగులూ గొబ్బెమ్మలతో అలంకరించారని అన్నారు. పోటీలలో మొదటి బహుమతిగా రూ.6,500 విలువైన వెట్ గ్రైండర్‌ను, ద్వితీయ బహుమతిగా రూ.5,200 విలువ గల డ్రెస్సింగ్ టేబుల్‌ను, తృతీయ బహుమతిగా రూ.4,300 విలువ గల ఎలక్ట్రిక్ కుక్కర్‌ను, తొమ్మిది మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హ్యాండ్ బ్యాగ్ అందజేశారు. కార్యక్రమంలో బయ్యవరపు విజయకీర్తి, పాటిబండ్ల శివరంజని, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందె రేవంత్, సెక్రటరీ గాజుల శ్రీనివాసరావు, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, డైరెక్టర్లు అందె మురళి, బట్టు వెంకటేశ్వరరావు, పారేపల్లి నిరంజన్ గుప్తా, కార్యక్రమ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, పూర్వ అధ్యక్షులు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, టి.సతీష్, సభ్యులు ఉదయ్ కొల్లి, పారేపల్లి మహేష్, చంద్రశేఖర్, రామనాదం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అనుమతులు లేకుండా వ్యాపారాలు

టీ షాపులకు అనుమతులు తీసుకుని చిల్లరకొట్లు ఏర్పాటు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో టీ షాపులకు, సంగం డెయిరీలకు అనుమతులు ఇస్తే వాటిస్థానంలో చిల్లరకొట్లు వ్యాపారాలు చేస్తున్నారని అలాంటి వాటిని సహించమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. శనివారం సంగం డెయిరీ షాపులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో కొంతమందికి టీ షాపులు పెట్టుకునేందుకు అవకాశం ఇచ్చారని, వాటిస్థానంలో ఇతర వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాపారాల వల్ల ఎలుకలు చొరబడేందుకు అవకాశం ఉందన్నారు. ఎముకలు, కీళ్ల విభాగం ఎదురుగా సంగం డెయిరీ షాపులో రెండు గదులను ఏర్పాటు చేసుకుని అక్రమ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ల్యాబ్‌కు సంబంధించిన వస్తువులు ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా అందిస్తుంటే, అమాయక రోగుల నుంచి రూ.5 చొప్పున వసూలు చేసి దోచుకుంటున్నారన్నారు. పొదిల ప్రసాద్ బ్లాక్ ఎదురుగా టీ షాపునకు అనుమతులు ఉన్నాయంటూ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ షాపులో టీ మాత్రమే విక్రయించాలని అనుమతి ఇస్తే, అలా కాకుండా రహస్యంగా అనేక రకాల వ్యాపారాలు చేస్తున్నట్లు పరిశీలనలో తేలిందని చెప్పారు. కేవలం వ్యాపార దృక్పథంతో రోగుల నుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. నెఫ్రో ప్లస్ డయాలసిస్ కేంద్రం పరిసర ప్రాంతాలు కూడా అపరిశుభ్రంగా ఉండటంపై నెఫ్రో ప్లస్ నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రం పరిసర ప్రాంతం 200 గజాల ఖాళీ స్థలంలో పనికిరాని మూటలు, చెత్తాచెదారం, వృథా అవుతున్న మంచి నీరుతో ఆ ప్రాంతమంతా కలుషితంగా మారిందన్నారు. ఈ ప్రాంతమంతా డంపింగ్ యార్డుగా మార్చారన్నారు. ఆసుపత్రిలో రోగులకు వైద్యం అందించడమే కాకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ పనులు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని మూడు వందల ఏళ్ల నాటి వేణుగోపాలస్వామి ఆలయం ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామానికి చెందిన డి.ప్రభాకర్‌రావు, భువనేశ్వరి దంపతులు నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం అందజేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో గాదె రామిరెడ్డి, ఆలయ ధర్మకర్త లక్ష్మారెడ్డిలు నూతన ధ్వజాన్ని రేపల్లె ప్రాంతం నుంచి గ్రామానికి తీసుకువచ్చారు. కొద్ది రోజులుగా పనివారు దానిని చెక్కుతున్నట్లు ఈఓ రామిరెడ్డి శనివారం తెలిపారు. పనులు పూర్తి అయిన తర్వాత నూతన ధ్వజస్తంభాన్ని వైఖానస శాస్త్రయుక్తంగా ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.



సంబరాలతో నగరానికి సంక్రాంతి శోభ

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సంక్రాంతి సంబరాల బ్రోచర్ ఆవిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, మేయర్ కావటి, ప్రజాప్రతినిధులు



సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, మేయర్ కావటి, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, ముస్తఫా

నెహ్రూనగర్: సంక్రాంతి పండుగ శోభను గుంటూరు నగరానికి నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాల ద్వారా తీసుకువస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు, పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్, షేక్ మొహమ్మద్ ముస్తఫా, అధికారులు, ప్రతినిధులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే తెలుగు ప్రజలకు అత్యంత ముఖ్యమైన పండుగ అని, సంక్రాంతికి గ్రామీణ ప్రాంతాలలో జరిగే పండుగ శోభను నగరపాలక సంస్థ గుంటూరు నగర ప్రజలకు చేరువ చేసిందన్నారు. నగర ప్రజలు సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొనాలన్నారు.

■ మేయర్ మాట్లాడుతూ గత ఏడాది సంక్రాంతి సంబరాలను అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకొన్నామని, ఈ ఏడాది కూడా అన్ని వయస్సుల వారిని అలరించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ నుంచి కులమతాలకు అతీతంగా పవిత్ర రంజాన్, క్రిస్మస్ వేడుకలు ఐక్యంగా జరుపుతున్నామని, అలాగే సంక్రాంతి సంబరాలు కూడా ఉత్సాహభరితంగా సాంప్రదాయ క్రీడలు కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతి రోజూ పండుగ వాతావరణం ఉంటుందన్నారు.

■ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ, తెలుగువారి ప్రధాన పండగ సంక్రాంతి అని, అటువంటి పండగ సంబరాలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ పండగలను పట్టణ ప్రజలు మరిచిపోతున్నారని ఇటువంటి తరుణంలో జీఎంసీ సంక్రాంతి సంబరాలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

సంక్రాంతి సంబరాలు

ఆదివారం భోగి సందర్భంగా ఉదయం 7గంటల నుంచి సంప్రదాయమైన సన్నాయి వాయిద్యాలతో స్వాగతం, భోగి మంటలు గంగిరెద్దుల విన్యాసాలు, చిన్నపిల్లలకు భోగి పండ్లు పోయటం, సాయంత్రం 6 గంటల నుంచి జబర్దస్త్ కళాకారులతో వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి సినీ గాయని దామిని, మెలోడీ స్టార్ శ్రీకృష్ణ, ట్రిపుల్ ఆర్ ఫేం హారికా నారాయణ్, ఉమా నేహా, రవి జాకీ, డీటీఎస్ ఆనంద్ లచే స్టార్ మ్యూజికల్ మస్తి డాన్స్ హంగామా జరుగుతాయని నగర ప్రజలు ఈ సంబరాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర రామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాయకుడు జేసుదాసు జన్మదిన వేడుకలు

లక్ష్మీపురం: ప్రముఖ సినీ నేపథ్య, శాస్త్రీయ సంగీత గాయకుడు స్వరరాగ గాన ప్రవాహం జేసు దాసు 84వ జన్మదిన వేడుకలను పాడుదాం రండి సంస్థ, బృందం సభ్యుల సమక్షంలో నిర్వహించడం చాలా సంతోషదాయకంగా ఆ సంస్థ సీనియర్ సభ్యుడు, విశ్లేషకులు ఎ.అమరాచారి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జేసుదాసు జన్మదిన వేడుకలో ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల పాటలకు తన గాత్రం అందించిన జేసుదాసు సుమారు లక్ష పాటలు పాడారని గుర్తు చేశారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సాంస్కృతిక విభాగాం కో-ఆర్డినేటర్ బిళ్లా అశోక్ కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా ఎనిమిది సార్లు అవార్డు పొందారని, నలభైసార్లు బెస్ట్ మేల్ సింగర్‌గా కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బెంగాలీ, ప్రభుత్వాలు పురస్కారాలు అందించాయన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు జేసుదాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జేసుదాసు చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సంస్థసభ్యులు

పేకాట శిబిరంపై పోలీసు దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం తేలప్రోలు శివారు డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో శనివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1750, మూడు బైకులు స్వాధీనపరుచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట ఆడుతున్న వారి సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగ్గుల పోటీలకు స్పందన

తెనాలిఅర్బన్: సంక్రాంతి వేడుకలలో భాగంగా తెనాలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు మాట్లాడారు. పోటీలలో గెలుపొందిన నాగరాజకుమారి, లక్ష్మి చంద్రావతిలకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా మాజేటి శారద, కొండవీటి పద్మావతి వ్యవహరించారు. సంఘ కార్యదర్శి భాస్కరుని ప్రసాద్, కోశాధికారి ఎంఎస్ఆర్ గుప్తా, నాయకులు మాలేపాటి తిరుమలేశ్వరరావు, చేబ్రోలు ఆది శేషగిరిరావు, మాదల పూర్ణ, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలలో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు

రేపల్లె రూరల్: పట్టణంలోని 8వ వార్డులో వార్డుకు చెందిన పొనుగుపాటి సుజాత ఆధ్వర్యంలో గుర్రం అరుణశ్రీ సహకారంతో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో జ్యోతి, తలపాల కృష్ణ, సువర్ణలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. ప్రత్యేక బహుమతికి గరికపాటి పల్లవి ఎంపికైంది.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

తాడికొండ: తాడికొండ మండలం రావెల గ్రామంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు శ్యామల కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముగ్గుల పోటీలు, కబడ్డీ, స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతోందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన చేబ్రోలులోని డాన్ బాస్కో స్కూల్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చేబ్రోలు నుంచి నారాకోడూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తూ కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో పాతగుంటూరు ప్రాంతానికి చెందిన ఎ.రాఘవ, చేబ్రోలుకు చెందిన ప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు విరిగిన ఇద్దరిని 108 వాహనాల ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి

- ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని పార్టీలు చేర్చాలి
- ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్
- ఆస్పత్రికి కంప్యూటర్ బహూకరణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే విధంగా తమ ఎన్నికల మేనిఫెస్టోలో అంశంగా చేర్చాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. మంగళగిరి పట్టణానికి చెందిన దామర్ల నరిసింహారావు సతీమణి నాగమణి ఐరన్ బల్లలతోపాటు కంప్యూటర్‌ను అందజేశారు. సాయిప్రసాద్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. డాక్టర్ ఎం.ఎస్.ఎస్.కోటేశ్వరరావు వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో 1986లో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించి ప్రారంభించారని అన్నారు. డీఎంఈ పరిధిలో ఉన్న ఈ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌కు మార్చాలని తాము కృషి చేస్తున్నామని, మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గీతా పద్మజ మాట్లాడుతూ కొత్త భవనం నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.రవి, పి.బాలకృష్ణ, నాగేశ్వరరావు, మాస్టర్ రాజేష్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు స్నేహరాజ్, సీనియర్ అసిస్టెంట్ సికిందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత



పెనుమాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నాడు-నేడు కింద నూతన భవనాల ఏర్పాటుతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, విద్యకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యత ఇప్పటి వరకు ఎవ్వరూ ఇవ్వలేదని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ టెక్నాలజీతో కూడిన ట్యాబ్‌లు అందజేస్తున్నారని, దీని వల్ల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరుస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ ఉన్నం సౌజన్య, కో ఆప్షన్ సభ్యులు బొక్కా ప్రసన్నకుమార్, మేకా దామేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కనకదుర్గ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖర్ రావు, పాఠశాల సహాయకులు రాధాకృష్ణ, సయ్యద్ జాకీర్ హుస్సేన్, పల్లె దానయ్య, ఎస్.నిర్మలజ్యోతి, ఎం.సుభాషిణి, ఎస్.సుధ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- మేయర్ కావటి నాగమనోహర్ నాయుడు
- ఎమ్మెల్యే ముస్తఫాతో కలిసి కార్పొరేషన్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్ వేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి

నెహ్రూనగర్: మానసిక ఒత్తిడిని తగ్గించి శారీరక దృఢత్వం అందించడంలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. శనివారం బీఆర్ స్టేడియంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాతో కలిసి టాస్ వేసి మేయర్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బౌలింగ్ చేయగా, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోజువారీ పనిలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని ఇష్టమైన ఆటలు ఆడడం ద్వారా అధిగమించవచ్చునన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల ప్రాధాన్యతను గుర్తెరిగి ఆడుదాం ఆంధ్రా ద్వారా ప్రతి ఒక్కరిని క్రీడలలో భాగస్వాములను చేస్తున్నారన్నారు. నగర పాలక సంస్థ ఉద్యోగులు క్రీడలలో పాల్గొనడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగాలతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఆడాలనే కోరిక, ప్రతిభ ఉన్నా ఆడుకోడానికి అవకాశం రానివారికి ఆడుదాం ఆంధ్రా మంచి వేదికగా నిలుస్తుందన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలని కోరారు. వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, నగర పాలక సంస్థ అదనపు కమీషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, మేనేజర్ శివన్నారాయణ, ఎంహెచ్ఓ మధుసూదన రావు, నగర్ పాలక సంస్థ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు దుర్గాప్రసాదుకు నివాళులు

తెనాలి: పట్టణ రంగస్థల కళాకారుల సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రజ్వలిత సంస్థ వ్యవస్థాపకుడు నాగళ్ల వెంకట దుర్గాప్రసాద్ మూడో వర్ధంతిని పురస్కరించుకొని శనివారం బుర్రిపాలెంరోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పలువురు కళాకారులు నివాళులర్పించారు. కళల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ఆర్అండ్‌బీ రాజు, చిట్టూరి సీతారామయ్య, అలపర్తి వెంకటేశ్వరరావు, వెలగా సుభాష్‌చంద్రబోస్, మేరిగ రామలింగేశ్వరుడు, కొండముది రమేష్, దేవిశెట్టి కృష్ణారావు, బెల్లంకొండ వెంకట్, పందిటి సుబ్బారావు, వేము రామరాజు, తెనాలి వినయ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



దుర్గాప్రసాద్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాకారులు

అంతర కళాశాలల పోటీల్లో 'హిందూ' విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాలల పోటీల్లో గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు తెలిపారు. శనివారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వక్తృత్వ పోటీలో జీఎల్‌వీ అంజన ప్రథమ బహుమతి, వి.పూజిత కన్సొలేషన్ బహుమతి సాధించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంగ్ల వ్యాసరచన పోటీలో వి. పూజిత, తెలుగు వ్యాసరచనలో ఎస్. భావన తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొని, బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీధర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ టి.మధుసూదన్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న రాఘవరావు, రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు